శ్రీరామ
జై శ్రీమన్నారాయణ
అస్మద్గురుభ్యోనమః శ్రీమతే రామానుజాయనమః ఓం హంహనుమతే నమః

పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగరామానుజ జీయరు స్వామి వారి దివ్యపాద సన్నిధికి అడియేన్ సాతులూరి నరసింహాచార్య రామానుజ దాసుడు అనేకానేకా సాష్టాంగ దండ ప్రణామాలు సవినయంగా సమర్పించుకుంటూ విన్నపించుకును అక్షరమకరంద చందన మాల ఏమనగా....................

స్వామీ!

గత రెండు సంవత్సరముల క్రితము ఈ " భగవంతునికీ.....బాధా?" అనే శీర్షికని మీ సన్నిధికి ఈ దాసుడు పంపడము జరిగినది. ఈ దాసుడి దురదృష్టము వలన అది మీ మన్నన పొందలేకపోయినది. అందుకని బాగా రెండు మూడు పర్యాయాలు చదివి, అనవసరమనిపించిన విషయాలని ఎడిట్ చేసి, మరల మీ అనుగ్రహానికై పంపుచున్నాను. (తమరు అన్యదా భావించక, దయతో మరొక్క సారి పరిశీలించ మనవి)

నాకు శరణ్య పత్రిక అంటే ఎనలేని మమకారం. కేవలం పండితులకు మాత్రమే పరిమితమయ్యే అంశాలే కాకుండా, ఇప్పుడిప్పుడే వైష్ణవ సంప్రదాయ గుళికలను ఆస్వాదిస్తున్న నాలాంటి సాధారణ పాఠకులను కూడా దృష్టిలో వుంచుకొని, శీర్షికలను పొందుపరచే విధానము ఈ దాసున్ని అమితంగా ఆకట్టుకుంది. శరణ్య పత్రికకు అలవాటుపడ్డాక, అన్య సంప్రదాయ, అన్ని సంప్రదాయాల్ని కలబోసే పత్రికలను చదవలేకపోతున్నాను. నాలాంటి ప్రాధమిక స్థాయిలో వున్న పాఠకులకు ఈ కథాంశము ఉపయోగకరంగా వుంటుందని మీరు భావిస్తే, దీనిని తమరు యధేశ్చగా వినియోగించుకోగలరని వినయంగా మనవిచేసుకుంటున్నాను. ఈ దాసుడే మీ సొత్తు అయినప్పుడు, ఇక ఈ దాసుడిచే తమరు వ్రాయించిన ఈ కథ గురించి ప్రత్యేకంగా చెప్పే అధికారం నాకు లేదు.. సదా మీ మంగళాశాసనాల్ని ఆశిస్తూ..........

జై శ్రీమన్నారాయణ

ఇట్లు
దాసాన దాసుడు
అడియేన్ సాతులూరి నరసింహాచార్య రామానుజ దాసుడు
LIG- 189, భరత్ నగర్ కాలనీ, శ్రీ సుందర హరి నిలయము,
సనత్ నగర్ పోస్టు, హైదరాబాద్ - 500 018.
సెల్ 9848531649

శ్రీరామ
జై శ్రీమన్నారాయణ
అస్మద్గురుభ్యోనమః శ్రీమతే రామానుజాయనమః ఓం హంహనుమతే నమః

# భగవంతునికీ............... బాధా!

--------సాతులూరి నరసింహాచార్యులు, ఎం.ఏ., బి.ఇడ్.,
హైద్రాబాద్

భగవంతునికి బాధా? ఇది మరీ బాగుందండి. మనమంటే (ఈ జీవులం) కర్మానుగతంగా ఆ కర్మ ఫలితాల్ని అనుభవించటానికి అనువుగా ఈ ప్రకృతి లోని పంచభూతాలతో తయారయిన వివిధ రకాలైన శరీరాల్లో ప్రవేశించి ఆయా ప్రారబ్ధ కర్మలను అనుభవించటం ద్వారా రకరకాల రోగాలు, రొష్టులు, కష్టాలు, నష్టాలు, సుఖాలు, సంతోషాలు వంటి ఫలితాల్ని పొందుతూ తద్వారా అనేక మానసిక, శారీరక సమస్యల్ని ఎదుర్కొంటూ జీవనయాత్ర కొనసాగిస్తూ వుండటం వలన మనకి అనేక బాధలు కల్గటం సహజం.

మరి ఆ భగవంతుడు, ఆ పరంధాముడు, ఆ పరమాత్మ యొక్క జన్మ తన సంకల్పానుసారం కదా? ఆయన శరీరం పంచోపనిషణ్మయమయినది మరియు ప్రకృతి పరిణామాలకి మార్పు చెందనిది, నిత్యమైనది. ఆయనే ఈ సర్వ జగత్తుని సృష్టిస్తాడు, కాపాడతాడు మరియు లయం చేస్తూవుంటాడు. అటువంటి ఆయనకు బాధా? అది ఎలాంటిది? శారీరకమా? మానసికమా? ఎవరివలన? ఎందుకు? ఆయన బాధ తీర్చగల్గే వారు ఎవరు?

మన బాధల్ని, కష్టాల్ని తొలిగించగలడని మనము ఆయన్ని ప్రార్థిస్తుంటే, ఆయనే బాధకి గురయితే ఇక మన గతి ఏమిటి? మన బాధల్ని రూపుమాపే వారెవరు? మన కష్టాల్ని మటుమాయం చేసేవారు ఎవరు? ఈ ప్రశ్నలకి సమాధానం ఆయన అనుగ్రహంతో, ఆయన ద్వారానే తెలుసుకునే ప్రయత్నం చేయాలి................చేద్దామా?

* * * * *

శ్రీరామ్, కృష్ణ, గోవింద్ లు ముగ్గురూ మంచి స్నేహితులు, మధ్యతరగతి కుటుంబాల నుంచి ఉద్యోగరీత్యా నగరానికి వచ్చి నివశిస్తున్నారు.

వీరిలో శ్రీరామ్ పేరుకు తగ్గట్లుగా సద్గుణ సంపన్నుడు. శ్రీరామ భక్తుడు. సాంప్రదాయబద్ధమైన కుటుంబం నుంచి వచ్చిన వాడు అవటం వలన చిన్నతనం నుండి భగవంతునిపై విశ్వాసం, ప్రేమ, భక్తి ఎక్కువ. సర్వభారాలు భగవంతుడే భరిస్తాడనీ, తను భగవంతునికి పారతంత్రుడననీ, ఆయన ఏ విధంగా ఉపయోగించుకుంటే అలా ఉపయోగపడే ఒక సాధనంవంటి వాడిననీ భావిస్తూ, తన సర్వవిధ కైంకర్యాలు భగవంతుని ప్రీతికొరకేనని ప్రగాఢంగా నమ్ముతూ, కర్మసిద్ధాంతం పై అచంచల విశ్వాసం కల్గివుండి తన జీవనయాత్ర కొనసాగిస్తున్నాడు. శ్రీరాముడి లక్షణాలే తనకి మార్గదర్శక సూత్రాలుగా నియమించుకుని వాటిని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నిస్తూ, ఆ భగవంతుని అనుగ్రహం పొంది తరించే విధంగా ఉజ్జీవిస్తున్నాడు. ఇతని భార్య శ్రీలక్ష్మి.

శ్రీరామ్ తనవృత్తిని దైవారాధనగా భావిస్తూ దానిని ఎంతగానో ప్రేమిస్తూ తన స్థాయికి తగ్గట్లుగా, తన పరిధికి లోబడి నలుగురికి ఉపయోగపడుతూ, కేవలం వచ్చే జీతంతోనే సంతృప్తి చెందుతూ పలువురికి ఆదర్శప్రాయుడుగా నిలుస్తున్నాడు. ఆత్మ సంతృప్తిని మించిన ఐశ్వర్యం, సంపద మరింకొకటి లేదన్నట్లుగా నిత్యసంతోషంతో, ప్రశాంతంగా తన మనుగడ కొనసాగిస్తున్నాడు. అందువలన అతని ముఖవర్చస్సు దివ్య తేజస్సుతో వెలుగొందుతూ ఇతరులను సమ్మోహనపరుస్తుంది. ఆనాడు ఆ శ్రీరామ చంద్రుడ్ని పుంసాం మోహన రూపాయ అన్నట్లు, ఈనాడు ఈ శ్రీరామ్ కూడా తన శారీరక సౌందర్యంతో, తన అమృత తుల్య పలుకులతో తన, పర, స్త్రీ, పురుష, పిన్నా, పెద్దా, అనే వ్యత్యాసం లేకుండా అందర్నీ ఆకట్టుకుంటూ అందరి ప్రేమకు పాత్రుడు అవుతున్నాడు.

ఇక కృష్ణ, గోవింద్ లది ఒకే రకమైన మనస్తత్వం. కనిపించని దేవుడి కోసం సమయం, ధనం ఖర్చు పెట్టటం వృధా అనే భావం. అలా అని పూర్తి నాస్తికులు కారు. అవకాశం, సమయం వుంటే ఉదయం లేచాక దేవుడి పటానికి రెండు అగరుబత్తు లు వెలిగించి ఒక నమస్కారం పెట్టేసి, ఎప్పుడైనా సరదాగా విహార యాత్రలాగా ఏదైనా పుణ్య క్షేత్రానికి వెళ్ళటం. అంతే వీళ్ళు భగవంతునికి ఇచ్చే ప్రాధాన్యత. ఈ మాత్రం కూడా ఎందుకో తెలుసా? పొరపాటున లేడు అనుకునే ఆ భగవంతుడు వుంటే, గింటే ఈ మాత్రం వీళ్ళ కైంకర్యానికి సంతోషించి ఆగ్రహించడని. భగవంతుడు అనేవాడు లేక పోతే ఎలాగూ సమస్యలేదు. వీరి ఉద్దేశంలో ధనమే అన్నిటికి మూలం. ధనాన్ని సంపాదిస్తే, అన్ని సుఖాల్ని అదే తెచ్చిపెడుతుందని. అనుభవించాల్సిన వయస్సుని వృధా చేసుకోకుండా సుఖాల్లో మునిగి తేలాలని. సకల భోగాల్ని అనుభవించాలంటే చాలీచాలని జీతాలు సరిపోవు కాబట్టి అందుకు జీతంతోపాటు గీతం కూడా కావాలని, ఆ మార్గాల్ని అన్వేషిస్తూ తద్వారా సంపాదిస్తూ వారు పయనించే మార్గమే ఈ నాటి జీవనవిధానానికి తగినదని విశ్వసిస్తూ ,వాదిస్తూ జీవనయాత్రని కొనసాగిస్తున్నారు.

ఈ ముగ్గురు స్నేహితులు ఎన్ని పనులున్నా ప్రతి శనివారం సెంట్రల్ లైబ్రరీ వద్ద కలుసుకుని కొంత సమయం పుస్తకాలతో గడిపి తర్వాత ఏ పార్కుకో వెళ్ళి ఆ తర్వాత ఎవరి గూటికి వారు చేరుతారు. అలాగే ఆ శనివారం కూడా ఆ ముగ్గురు స్నేహితులు లైబ్రరీ వద్ద కలిసారు.

*****

వివిధ పత్రికల్ని, పుస్తకాల్ని తిరగేస్తున్న స్నేహితులకి “శరణ్య” అనే ఆధ్యాత్మిక పత్రిక కనపడింది. అందులో “భగవంతునికే తీరని కోరిక ” అనే శీర్షిక ముగ్గుర్ని ఆకర్షించగా ముగ్గురూ ఆ శీర్షికని ఉత్కంఠ భరితంగా చదివి, బయటకు వచ్చి పార్కులో చతికలపడ్డారు. లైబ్రరీ నుండి బయటకు వచ్చినప్పటినుండి శ్రీరామ్ పరధ్యానంగా వుండటం గమనించిన మిత్రులు అందుకు కారణాన్ని అడిగి తెలుసుకుని తను లైబ్రరీలో చదివిన కథ గురించి

ఆలోచిస్తూ మనసుపాడుచేసుకుంటున్నాడని గ్రహించి, తనని ఐహిక విషయాల్లోకి లాగాలని మిత్రులు ఎంత ప్రయత్నించినా, శ్రీరామ్ మాత్రం ఆ కథలోని అంశాల్నే తలచుకుంటూ“నిజంగా భగవంతుడి యెడ మనము ఎంత ఘోరంగా ప్రవర్తిస్తున్నాము?ఆయన మన నుంచి స్వచ్ఛమైన ప్రేమను పొందటానికి ఎంత తపిస్తున్నాడో కదా?” అన్నాడు చెమర్చిన కళ్ళతో.

శ్రీరామ్ పరిస్థితి చూసిన కృష్ణ “శ్రీరామ్ ఆ కథ గురించి ఎందుకు అంత గా ఆలోచించి మనస్సు పాడు చేసుకుంటావు” అన్నాడు .

‘ మనము ఎవ్వరము నిస్వార్థంగా ఆయన్ని ప్రేమించటం లేదు, ఏమి ఆశించకుండా ఆయన్ని దర్శించుకోవటం లేదు కదా అని ఆలోచిస్తుంటే చాలా బాధగా వుంది” అన్నాడు శ్రీరామ్.

‘శ్రీరామ్ ఒక విషయం అడుగుతా సమాధానం చెప్పు? భగవంతుడు వున్నాడనే అనుకుందాం, ఆయన దగ్గరకు కోరికతోకాక, ఆయన యోగక్షేమాలు అడగటానికి ఎవరైనా ఎందుకువెళ్తారు చెప్పు? వేలకు వేలు డబ్బు ఖర్చుపెట్టి, సెలవులు పెట్టి, ఎంతో వ్యయప్రయాసలతో క్యూల్లో గంటల తరబడి నిలబడి, చివరకు ఆయన్ని ఒక్కక్షణం కూడా చూడనివ్వకుండా నెట్టివేస్తున్నా సహిస్తూ, స్వామి! నువ్వు బాగుండాలి, నిన్ను పలకరిద్దామని వచ్చాను అంటారా? మూఢనమ్మకాల్తో బ్రతుకుతున్న ప్రజలు కాబట్టి, గుళ్ళుగోపురాలు చుట్టూ తిరుగుతూ తమ కోరికలు తీరాలని వేడుకుంటున్నారు. అలా కోరినంత మాత్రాన నెరవేరతాయా? అలా అందరి అవసరాలు, కోరికలు, కష్టాలు తీరేటట్లయితే ఈ వ్యవస్థ, ఆఫీస్ లు, హాస్పటిల్స్, కోర్ట్ లు, పోలీస్ స్టేషన్సు యివన్నీ ఎందుకు? ఎవరికి ఏ సమస్య వచ్చిన ఎంచక్కా ఏ గుళ్ళోనో కళ్ళుమూసుకుని కూర్చుని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తే సరిపోదు? ఒక వ్యక్తిని పూర్వజన్మ, వచ్చేజన్మ అంటూ టెన్ష న్స్ కి గురి చేస్తూ ఈ జన్మలో సుఖాల్ని, ఆనందాల్ని అనుభవించకుండా చేస్తున్నారు. పూర్వజన్మలు,వచ్చేజన్మలు అంటూ ఏవీ లేవు. ఉన్నది ఈ జన్మే, దాన్ని హాయిగా అనుభవించటమే. అలా అనుభవించాలంటే మనీ కావాలి. మన లక్ష్యం దాన్ని సంపాదించటమే. కోరికలు తీరాలంటే గుళ్ళు పట్టుకుని తిరిగితే తీరవు, ఆ కోరిక ఎవరివల్ల తీరుతుందో వాళ్ళని పట్టుకోవాలి. అయినా నువ్వన్నట్లు ఆయనకే కోరిక తీరలేదంటే ఇక మన కోరికలు ఆయనేం తీరుస్తాడు. నిజంగా ఆయన శక్తివంతుడే అయితే మనము ఆయన్ని ప్రేమించటం లేదని బాధపడే బదులు మనచేత ప్రేమించేటట్లుగా ఆయనే చేసుకోవచ్చు కదా? ” అని కృష్ణ సుదీర్ఘ ఉపన్యాసం ఇస్తే తన స్నేహితుడి వాక్ చాతుర్యానికి ముచ్చటపడ్తూ తందానా అంటున్నాడు గోవింద్.

స్నేహితుల అమాయకత్వానికి జాలి పడ్తూ శ్రీరామ్ “ భగవంతుడు తన ప్రయత్నం ఎప్పుడూ చేస్తూనే వుంటాడు. ఆ ప్రయత్నంలో భాగంగానే అనేక అవతారాలు ఎత్తాడు. ముఖ్యంగా శ్రీరాముడుగా అవతరించి అనేక కష్టాల్ని అనుభవించి, మానవుడు ఎలా జీవించాలో తన ఆచరణ ద్వారా మనకు తెలియజేసి ఆదర్శప్రాయుడయ్యాడు. అందుకే ‘రామ’ అని ఒక్కసారి నోరారా ఉచ్చరిస్తే చాలు తనువు పులకించి పోతుంది. రామచరిత్రను తలచుకుంటే చాలు మనస్సుఆనంద పారవశ్యంలో తేలియాడుతుంది. అందుకే ఈ నాటికి అందరి హృదయాల్లో శ్రీరాముడు చెరగని ముద్ర గా నిలిచిపోయాడు” అంటూ శ్రీరామ్ రామ పరవశంలో మునిగిపోయాడు.

“ ఈ పుక్కిటి పురాణాల్ని నెమరేసుకుంటూ కూర్చుంటే మన జీవితాలు గడవవు” అని విమర్శించాడు కృష్ణ.

“ చూడు కృష్ణ మనం పుణ్యభూమిలో జన్మించాం, అందుకు ఎంతో గర్వపడాలి. శ్రీరామాయణంలోని మానవత్వపు విలువల్ని గుర్తించిన విదేశీయులే ఎంతగానో ఆదరిస్తున్నారు. మనమేమో ఇలా వితండ వాదన చేస్తున్నాం. శ్రీరామాయణం కాల్పనిక కథ

కాదు. అది జరిగిన కథ, ఇతిహాసం. మానవుడు ఎలా ప్రవర్తించాలో తెలియజేయటానికి ఆ శ్రీమన్నారాయణుడు రాముడుగా అవతరిస్తే, ఆ వేదమే శ్రీరామాయణంగా అవతరించింది" అని వివరించాడు శ్రీరామ్.

"సరే, నీ వాదమే వాస్తవం అనుకున్నా , రామాయణం నాటి రాముడి యుగం వేరు, ఇప్పటి యుగం వేరు. యుగధర్మాలు, కాలాన్నిబట్టి మారుతుంటాయి, ఆనాడు రాక్షసులు ఎక్కడో అడవుల్లో వుండేవారు. ఈనాడు ఎక్కడ చూసినా రాక్షసులే, ఈ నాటి సామాజిక స్థితికి రాముడి ఆదర్శాలు పనికిరావు. అదీకాక ఆ కష్టాల్ని, నష్టాల్ని భరిస్తూ ఆ రాముడు వున్నాడంటే మీరన్నట్లుగా ఆయన భగవంతుడు కాబట్టి, ఆయనకు అసాధ్యం అనేది వుండదు కాబట్టి ఆ రకంగా ఆదర్శంగా జీవించగల్గాడు. మనబోటి సామాన్యులకు అది అసాధ్యం, ఇది కలికాలం. ఇప్పుడు మళ్ళీ ఆ రాముడే అవతరించినా అలా ప్రవర్తించలేడు. ఇది నూటికి నూరుపాళ్ళ నిజం" అని మూర్ఖంగా వాదించాడు కృష్ణ.

దానికి సమాధానంగా శ్రీరామ్ " మానవత్వం అవసరం లేదు, రాక్షసులుగానే జీవిస్తాం అనేవారిని ఎవ్వరూ సమాధానపర్చలేరు. సాధ్యమా,అసాధ్యమా అనే ప్రసక్తి ప్రక్కన పెట్టి కనీసం ఆ దిశగా పయనించే ప్రయత్నంగా మనము అడుగులు వేస్తే, ఆ పరమాత్మే మనల్ని నడిపించుకునే బాధ్యత స్వీకరిస్తాడు. అంతేకాని మురికిలోపడి జీవిస్తున్నాం అని తెలిసికూడా బయటపడే ప్రయత్నం చేయక, యింకా లోతుగా అందులోనే కూరుకుపోతాం అంటే ఆ భగవంతుడు మాత్రం ఏం చేస్తాడు. కనీసం ఆయన అందించే చెయ్యిని అందుకునే ప్రయత్నం మనం చేస్తే, మనల్ని ఆయన తరింపచేస్తాడు. ఈ కాలంలో కూడా ఆ రామచంద్రుడ్ని ఆదర్శంగా తీసుకుని తమ జీవితాల్ని మలచుకుంటున్న వారు అనేకమంది మన మధ్యే నివసిస్తున్నా మనం వార్ని గుర్తించలేము. ఎవరిమటుకు వారు ఈ సమాజం కుళ్ళి పోయింది అనుకుంటూ ఆ కుళ్ళులోనే కలసిపోతాం అంటే ఏం చెప్పగలం?"అని ఆవేశంగా తన బాధని వెలిబుచ్చాడు శ్రీరామ్.

"చూడు శ్రీరామ్ నువ్వు చెప్పే మాటలు వేదికమీద ఉపన్యాసాలకి, కథలకి ఉపయోగపడతాయే తప్ప, ఆచరణకి వచ్చేసరికి అందరూ వాటికి తిలోదకాలిచ్చేవారే. ఎక్కడో నీ లాంటి అమాయకుడు అంధ విశ్వాసంలో పడి కొట్టుకుంటూ వుంటాడు. మనం ప్రస్తుతం జీవిత ప్రారంభ దశలో వున్నాము, మనకింకా పిల్లలు వారి చదువులు వంటి సమస్యలు యింకా ఉత్పన్నమే కాలేదు. అప్పుడే మనము వయస్సుడిగి పోయిన వాళ్ళు మాట్లాడే వేదాంతాన్ని వల్లె వేస్తూ కూర్చుంటే కుదరదు" అన్నాడు కృష్ణ.

అందుకు శ్రీరామ్ "భగవదనుభూతి అనేది ఎవరికి వారు అనుభవంలో తెలుసుకోవాల్సిందే, ఒకరి అనుభవాన్ని మరొకరికి చెప్పినా విశ్వాసం కలగదు. మిమ్మల్ని నమ్మించ గల్గేవాడు, అనుగ్రహించేవాడు ఆ భగవంతుడు ఒక్కడే. ఆ పరమాత్మ చల్లని వీక్షణ మీపై ప్రసరించి మీకు కనువిప్పు కలగాలని మనస్ఫూర్తిగా వేడుకోవటం తప్ప నేనేమి చేయలేను" అన్నాడు బాధగా.

దానికి కృష్ణ " సరే నువ్వు అలాగే ఆయన్ని ప్రార్థించి మమ్మల్ని నీ మార్గంలోకి రప్పించుకుంటావో, లేదు ఈ సమాజంలో జీవనయాత్ర కొనసాగిస్తూ ఎదరవుతున్న ఒక్కొక్క సమస్యకు, దానికి తగ్గ అవసరాలకు తట్టుకోలేక నువ్వే మా మార్గమే సరియైనదని గుర్తిస్తావో చూద్దాం. కాని ఒక్క షరతు మనము ఎవరి పద్ధతిలో వారు పయనించినా, మన స్నేహం ఎప్పటికి ఇలాగే వుండాలి" అన్నాడు.

"సరే అలాగే, చాలా ప్రొద్దుపోయింది, ఇక బయలుదేరుదాం"అన్నాడు శ్రీరామ్.

ఆ రకంగా ముగ్గురు మిత్రులు వాదించుకుని, వాదనతో ఎవరి అభిప్రాయాల్ని మార్చలేమని గ్రహించి, అన్నిటికి కాలము, పరిస్థితులే సమాధానం చెప్తాయనే నమ్మకంతో ఎవరి ఇండ్ల దారి వారు పట్టారు.

* * *

భూలోకంలో ఈ మిత్రుల సంభాషణల్ని పాలకడలి నుంచి లక్ష్మీసమేతుడైన శ్రీమహావిష్ణువు వీక్షించి, ఎంతో అసంతృప్తితో బాధపడుతూవున్న స్వామివార్ని అమ్మవారు " స్వామీ! ఆ మానవుల సంభాషణకు మీరు బాగా కలత చెందుతున్నట్లు వున్నారు" అంది.

" అవును దేవీ, నా కోరికను, ఆర్తిని ఒక భక్తుడి ద్వారా తెలిపాను. కనీసం తద్వార అయినా నా అభీష్టం మేరకు జీవులు నాదరి చేరే ప్రయత్నం చేస్తారని ఆశించాను. నా భక్తుడు వార్ని సమాధాన పరచటానికి ఎంత ప్రయత్నించినా, వారు మూర్ఖపు మొండి వాదనలతో అతని నోరు మెదపకుండా చేసారు. అందుకు నాకు చాలా బాధగా వుంది దేవి" అన్నారు స్వామి.

దానికి అమ్మవారు " స్వామీ, నన్ను వెళ్ళి వాళ్ళకి మీ వైభవాన్ని తెలిపి మీ దిశగా ప్రవర్తించే విధంగా మార్చే ప్రయత్నం చేయమంటారా? " అంది.

అందుకు స్వామివారు తల అడ్డంగా ఊపుతూ " వద్దు దేవి, ఇంతకు ముందు ఆ రావణాసురుణ్ణి నాకు అనుకూలంగా మార్చి, నాతో స్నేహం చేసేలా మారుస్తానని నన్ను వదిలి, వాడి చెరకి చేరావు. ఎంతో ప్రయత్నం చేసావు. సంవత్సరంపాటు నన్ను ఒంటరిని చేసి, ఎంతో క్షోభకి గురి చేసావు. కాని ఫలితం సాధించలేకపోయావు. వీళ్ళు ఆ రావణుడి కంటే కూడా ప్రమాదకరమైన వారు. ఆ రావణుడు కనీసం నిన్ను స్పృశించకుండా వున్నాడు. కాని వీళ్ళ చేతికి నువ్వు చిక్కావా, నిన్ను బంధించి, తాళాలు వేసేస్తారు. నిన్ను మళ్ళీ నా దరి చేర్చుకోవటానికి నేను అవనిపై అవతరించాలి. ఎందుకు వచ్చిన కష్టం చెప్పు" అన్నారు స్వామి.

అందుకు అమ్మవారు " స్వామీ! సౌలభ్యం, సౌశీల్యం, వాత్సల్యం వంటి గుణాలు పరిపూర్ణంగా వున్న మీరే మన సంతానం పట్ల ఆగ్రహం చూపితే ఎలా? మీరే ఏదోరకంగా వారిని అనుగ్రహించాలి" అని విన్నపించుకుంది.

" తప్పక అనుగ్రహిస్తాను దేవి, అందుకు నా ప్రయత్నం నేను చేస్తాను" అని స్వామి అభయమిచ్చారు.

అందుకు అమ్మవారు ఎంతో ఆతృతతో, ఉత్సాహంతో " తమరు ఇప్పుడు ఏ రకంగా ఆ జీవుల్ని అనుగ్రహించబోతున్నారు స్వామి" అని అడిగింది.

దానికి సమాధానంగా స్వామి చిరుమందహాసంతో " నీవే వీక్షించు దేవీ నా లీలని " అని తన మాయని ఆ మిత్రులపై ప్రసరింపచేసారు.

* * *

కాలచక్రం తనపని నిర్విరామంగా, నిరాఘాటంగా చేసుకుపోతూంది. ముగ్గురు మిత్రులకు మగసంతానం కల్గింది. ఎవరు నమ్మిన సిద్ధాంతం ప్రకారం వారు, వారి వారి జీవనయాత్రని కొనసాగిస్తున్నారు.

శ్రీరామ్ తనకి కల్గిన సంతానాన్ని తన ఆశయాలకు అనుగుణంగా పెద్దచేసాడు. లౌకికవిద్యతో పాటు ఆధ్యాత్మిక విషయాల్ని కూడా తెలియజేస్తూ మూర్తీభవించిన మానవుడిగా తీర్చిదిద్దాడు. రామాయణాది ఇతిహాసాల్ని, అందులో అంతర్లీనంగా నిక్షిప్తమైవున్న మానవత్వపు లక్షణాల్ని తెలియజేస్తూ ప్రయోజకున్ని చేసాడు. సంతానం పట్ల ఎంతవరకు శ్రద్ధ చూపాలో అంతవరకే చూపుతూ, తన ఆత్మోజ్జీవనానికి సంసారాన్ని అడ్డురానీయకుండా తను ఉజ్జీవిస్తూ తన కుటుంబ సభ్యులు కూడా సక్రమమైన మార్గంలో పయనించటానికి కావలసిన మార్గాన్ని చూపుతూ, తనకున్న దానితో కొడుకుని డాక్టర్

చదివించాడు. తన ఆశయం మేరకు పేద ప్రజలకు ఉచితంగా వైద్యం చేయిస్తూ, ప్రజల పాలిట దేవుడిగా తన పుత్రుడ్ని నిలిపాడు.

ఇక కృష్ణ, గోవింద్ లు తమ సంతానాన్ని బాగా చదివించాలని, వాళ్ళు విదేశాలకు వెళ్ళి కోట్లు గడించాలనే ఆశతో పిల్లల సామర్ధ్యాన్ని దృష్టిలో పెట్టుకోకుండా చదువుని కొనటంపైనే దృష్టిసారించి, అందుకు అనేక అడ్డదారులద్వారా డబ్బు సంపాదిస్తూ, దాన్ని వ్యాపారంగా పిల్లల చదువులపై వెచ్చిస్తూ, వాళ్ళ చదువుల్ని వీరే చదివేటంత ఆయాసపడ్తూ, వాళ్ళమీద విపరీతమైన ప్రేమను, ఆశల్ని పెంచుకుని, వీళ్ళ జీవనగమనాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఎంత క్రిందా, మీదా పడ్డా అంటవలసినంతే అంటుతుందన్నట్లు, వారి మానసిక స్థితికి తగ్గ విద్యే వారికి అబ్బింది. ఆ చదువులకు తగ్గ కొలువులు వేరే ప్రాంతాలలో లభించటంతో ఆయా ప్రాంతాలకు పిల్లలు వెళ్ళారు. సంవత్సరాలు నిమిషాల్లా గిర్రున తిరిగిపోతున్నాయి. మిత్రుల పిల్లలకు పెళ్ళిళ్ళు, వాళ్ళకి సంతానం, వాళ్ళ కాన్వెంటు చదువులతో సంసార చక్రం తిరుగుతోంది. ముగ్గురు మిత్రులు పదవీవిరమణ చేసారు. శ్రీరామ్ కంటే కృష్ణ, గోవింద్ లు ఆర్థికంగా ఉన్నతస్థితిలో వుండగా, శ్రీరామ్ వీళ్ళకంటే అత్యున్నతమైన సంపదకి హక్కు దారుడయ్యాడు. అదే ఆత్మ సంతృప్తి, అందుకే అతని ముఖం ప్రశాంతతకు చిరునామాగా మారింది. కృష్ణ, గోవింద్ లు డబ్బుతో పాటు జబ్బుల్ని కూడా సంపాదించుకున్నారు. ఎంతవున్నా, ఎంత సంపాదించినా మానసిక అశాంతి, ఏదో లోటు. ఉన్న ఒక్క సంతానానికి కూడా వీళ్ళ మీద కంటే, వీళ్ళు సంపాదించిన ఆస్తి మీద. బ్యాంకులో జమచేసిన బ్యాలన్సుల మీద మక్కువ ఎక్కువ. వాటిని ఏ రకంగా వారి హస్తగతం చేసుకుందామా అనే ఆలోచనలతో, రకరకాల యుక్తులతో, కుయుక్తులతో కన్నవార్ని వంచనచేస్తూ, బోల్తాకొట్టిస్తూ తమ ప్రయత్నంలో విజయం సాధిస్తూ తమ కోరికల్ని తీర్చుకుంటూ, విలాసంగా తమ రోజుల్ని గడుపుతూ అదే తమ పరమావధిగా, జీవిత లక్ష్యంగా భావిస్తున్నారు. అందుకు ఆ వృద్ధ జంటలు ఎంతో క్షోభకి గురవుతూ, విలపిస్తున్నారు. అలా రోజులు గడుస్తుండగా ఒకానొక రోజు కృష్ణ భార్య సత్య అనారోగ్యంతో మంచం పట్టింది. కొడుకు మీద బెంగ అధికమయింది. షరా మామూలే. వీళ్ళు పరితపించటం, వాళ్ళు పట్టించుకోకపోవటం. భార్యకు సపర్యలు చేస్తూ ఓదారుస్తున్నాడు కృష్ణ. ఆ సమయంలో శ్రీరామ్ వచ్చి వాళ్ళ పరిస్థితిని వీక్షించి అచ్యుత్ ని తీసుకువస్తా" అంటూ వాళ్ళ సమాధానం కోసం కూడా చూడకుండా వెళ్ళాడు. కృష్ణ అసహాయస్థితిలో శ్రీరామ్ వెళ్ళిన వైపు చూస్తూ నిశ్శబ్ధంగా వుండిపోయాడు.

* * * *

గోడకు కొట్టిన బంతిలా ఒంటరిగా దిగులుగా తిరిగివచ్చిన శ్రీరామ్ ని చూసి "ఏడిరా అచ్యుత్, ఒక్కడివే వచ్చావే? ఏమన్నాడు?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు కృష్ణ. అందుకు శ్రీరామ్ తన భార్య శ్రీలక్ష్మిని సత్యకి తోడుగా వుంచి "పార్కుకి వెళ్ళి మాట్లాడుకుందాం, అక్కడకి గోవింద్ కూడా వస్తానన్నాడు." అని స్నేహితుడ్ని బయలుదేరతీసి, పార్కులో విశ్రాంతిగా కుర్చున్నాక, కృష్ణ ఆతృతగా "ఇప్పుడు చెప్పరా? ఏం జరిగింది" అని అడిగాడు.

"అచ్యుత్ బాగా మారిపోయాడురా, వాడి మనస్సులో కరన్సీకే తప్ప కరుణకు స్థానం లేదు. చాలా కటువుగా మాట్లాడాడు" అని చెమ్మగిల్లిన కళ్ళతో చెప్పాడు శ్రీరామ్.

"అసలు ఏం జరిగిందో వివరంగా చెప్పు" అని ప్రశ్నించాడు కృష్ణ.

"నేను వాడ్ని నాతో తీసుకురావటానికి విశ్వప్రయత్నాలు చేసాను. వాడు యిప్పుడు రావటం కుదరదంటే కుదరదన్నాడు. పైగా ముసలివాళ్ళు ఖాళీగా కూర్చుని ఎప్పుడంటే అప్పుడు పరిగెత్తుకు రమ్మంటే ఎలా? అన్నాడురా" అని చెప్పలేక చెప్పలేక బాధతో చెప్పాడు శ్రీరామ్.

అందుకు కృష్ణ ఒక్కసారిగా భారంగా గాలి పీల్చి వదిలి ఇంకా ఏమన్నాడో చెప్పమన్నట్లుగా చూసాడు.

"మీరు వాడ్ని ఎంత కష్టపడి పెంచింది, చదివించింది, వాడి అవసరాలకు మీరు ఎలా ఆదుకున్నది, వాడి మీద మీరు పెట్టుకున్న ఆశల్ని వివరించాను. అందుకు వాడు ప్రపంచంలో ఏ తల్లిదండ్రులు చేయని పని ఏమైనా చేసారా? అయినా మేము కనమని, మామీద ఆశలు పెంచుకోమని ప్రాధేయపడ్డామా? కనినందుకు పెంచటం, అవసరాలు తీర్చటం వాళ్ళ బాధ్యత. అయినా సంపాదించింది మా కోసమే కదా? మా అవసరాలకు ఉపయోగపడకపోతే ఆ సంపాదన ఎందుకు? అయినా మాకు ప్రేమ లేదు ప్రేమ లేదు అంటారు, ఆ ప్రేమేదో వాళ్ళమీద కల్గేటట్లుగా ఎందుకు పెంచలేకపోయారు? అంటే మా ఈ ప్రవర్తనకి కారణం వాళ్ళ పెంపకమే కదా? మమ్మల్ని ఎందుకు తప్పు పడతారు. మా అవకాశాన్నిబట్టి వస్తానని చెప్పండి. ఇదిరా నీ కొడుకు నాకు ఉపదేశించిన పుత్రగీత" అని శ్రీరామ్ చెప్తున్న సమయంలో గోవింద్ కూడా వచ్చి అంతా విన్నాడు. తర్వాత శ్రీరామ్ కృష్ణని ఓదార్చి, తను ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం గురించి తన గురువుగార్ని కలవాలని, తర్వాత ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పి అక్కడ నుంచి నిష్క్రమించాడు.

కృష్ణ తన పుత్రలీలలు గోవింద్ కి చెప్పి చెమ్మగిల్లిన కళ్ళతో "నీ కొడుకే నయంరా, నీకు యాక్సిడెంటయి మంచంమీద నుంచి నువ్వు లేవలేని స్థితిలో వుంటే నీకు సపర్యలు చేసాడు" అంటే అందుకు గోవింద్ అన్యమనస్కంగా ఒక జీవంలేని నవ్వు నవ్వాడు. ఆ నవ్వులోని ఆంతర్యం గ్రహించలేని కృష్ణ "ఎందుకురా నవ్వుతున్నావు" అని ప్రశ్నించాడు.

"దూరపు కొండలు నునుపు అన్నట్లు, నీ పరిస్థితికి ఏ మాత్రం భిన్నం కాదు నా పరిస్థితి" అన్నాడు గోవింద్.

" అదేమిట్రా.... నువ్వు, నీ భార్య యిద్దరూ అనారోగ్యంగా వుంటే నీ కొడుకు, కోడలే కదా మిమ్మల్ని నెత్తిమీద పెట్టుకుని మీకు సేవలు చేసింది" అని అమాయకంగా ప్రశ్నించాడు.

"అవును నిజమే. నాకు నిజం తెలియక చాలా సంతోషించాను. కాని వాళ్ళు మా మీద చూపించిన ప్రేమకు కారణం నా వద్ద వున్న బ్యాంక్ బ్యాలన్సు" అని గోవింద్ కళ్ళవెంట నీళ్ళు పెట్టుకున్నాడు.

అంతా విన్న కృష్ణ గద్గద కంఠంతో " ఇన్నాళ్ళు నువ్వైనా నీ సంతానంతో ఆనందంగా వున్నావని ఆశపడ్డాను. కాని నీ పరిస్థితీ ఘోరంగానే వుంది. మన ముగ్గురిలో శ్రీరామ్ నిజంగా అదృష్టవంతుడు. వాడి కొడుకు, కోడలికి వీళ్ళంటే ప్రాణం. ఉన్నదాంతో సంతృప్తి చెందుతూ అందరు కలిసి హాయిగా జీవిస్తున్నారు. చివరికి వాడి మార్గమే సరియైనదనిపిస్తుంది. చక్కగా ఆ భగవంతుడిని నమ్ముకుని, ఆయన మీద పూర్తి భారం వేసి నిశ్చింతగా, నిర్భయంగా, ఆత్మ సంతృప్తితో బ్రతుకుతున్నాడు. మనం పిల్లల కోసం మన జీవితాల్ని తాకట్టు పెట్టి, పడరాని పాట్లు పడి, ఈ రోజున వీధిన పడ్డాము. జీవితం చివరిదశకు వచ్చాక ఇప్పుడు తెలుసుకుని ఏం ప్రయోజనం" అని ఇద్దరు మిత్రులు తమ జీవితాల్ని నెమరువేసుకుంటూ పశ్చాత్తాపంతో కుమిలిపోతుండగా వాళ్ళ ముందు అనేక కోట్ల మెరుపుల కాంతి ఒక్కసారిగా జిగేలుమనిపించి, కోటిమంది ఆదిత్యులు ఒక్కసారే ఉదయించారా? అన్నట్లుగా ఒక దివ్య పురుషుడు నాలుగు చేతులతో, శంఖ, చక్ర, గదాయుధాల్ని ధరించి ప్రత్యక్షమయ్యాడు. ఆ దివ్య పురుషుడిని చూడటానికి ఆ మిత్రుల లౌకిక నేత్ర శక్తి సరిపోకపోవటంతో, ఆ పరమాత్మ వారికి దివ్య చక్షువుల్ని ప్రసాదిస్తే, వాటితో ఆ పరంధాముడిని వీక్షించిన మిత్రులు నోట మాట రాక స్థాణువుల్లా వుండిపోయారు. అలా నిశ్చేష్టులై వున్న భక్తుల్ని చూస్తూ " భక్తులారా! మీరు దేని గురించి చింతిస్తున్నారు?" అని భగవంతుడు ప్రశ్నించాడు.

మరల వారిని కలి ఆవహించటంతో ఆ భగవంతుడ్ని గుర్తించలేక " మా బాధ సరే, ఇంతకి తమరు ఎవరు ప్రభూ" అని హేళనగా ప్రశ్నించారు.

దానికి స్వామి "నేను పరమాత్మని, మిమ్మల్ని అనుగ్రహిద్దామని ఆ పరమపదం నుంచి మీ ముందు ప్రత్యక్షమయ్యాను" అన్నాడు.

"చూడు నాయినా, నీ వేషం, నీ భాష, చాలా బాగున్నాయి. నిన్ను ప్రశంసించి, ప్రోత్సహించే స్థితిలో మేము లేము. వేరే ఎక్కడికైనా వెళ్ళి నీ ప్రతిభ ప్రదర్శించుకో" అన్నారు.

" భక్తులారా!.... నేను వాస్తవంగా పరమాత్మనే, మిమ్మల్ని కరుణించి కటాక్షిద్దామనే మీకు దర్శనమిస్తున్నాను. అయినా కలికాలం కదా? సాక్షాత్తు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడినయిన నన్ను మీరు గుర్తించలేరు. అందుకే నిత్యం మిమ్మల్ని నాకు చూడాలని, పలకరించాలనిపించిన, మీరు నన్ను గుర్తించి ఆదరించరని దూరంగా నివసిస్తున్నాను. నా వ్యధని అనేకమంది భక్తుల ద్వారా తెలియపరుస్తున్నాను. అయినా మీరు గుర్తించటంలేదు. ఈ యుగ లక్షణం అలాంటిది. ఏమీ ఆశించకుండా సహాయం చేసే వారిని కూడా సంశయిస్తారు. అలాంటిది మీరు నన్ను విశ్వసిస్తారా? నా శక్తిని యిప్పుడే కాదు ఎప్పుడూ నిరూపించుకోవల్సిందే. ఆనాడు త్రేతాయుగంలో నేను రాముడిగా అవతరించి సుగ్రీవుడ్ని అనుగ్రహిద్దామని అభయమిస్తే నా శక్తిమీద విశ్వాసం లేక శంకిస్తే నా కాలి బొటనవ్రేలితో చచ్చిపడివున్న దుందుభి శరీరాన్ని కదల్చి చిమ్మితే అది పది యోజనముల ఆవల పడింది. అయినా సుగ్రీవుడికి నమ్మకం కుదరకపోతే విల్లుపట్టి ఒకేఒక బాణమును సంధించి ఒక సాల వృక్షమును గురి చూచి ప్రయోగించాను. అది ఒక చెట్టునుగాదు ఏడు చెట్లలో నుండి దూసుకొనిపోయి, కొండ చరియయందలి భూమిలో దూరి, ఒక్క క్షణంలో ఆ భూమిని బ్రద్దలు చేసుకుని మహావేగముతో వెలికి వచ్చి నా అమ్ముల పొదిలో చేరినది. ఆ విధంగా నా చే ప్రయోగింపబడిన బాణము ఏడు సాల వృక్షములను ఛేదించటంతో నాపై సుగ్రీవునికి నమ్మకం కుదిరింది. అలాగే మీకు నాపై సంశయంవుంటే నన్ను పరీక్షించుకుని నివృత్తి చేసుకోండి" అన్నాడు స్వామి.

మిత్రులు ఇద్దరూ అయోమయంలో వున్నారు. ఇది కలా? వాస్తవమా? అనే అర్థం కాని స్థితిలో వున్నారు. నిజంగా వారిముందు వున్నది ఆ పరమాత్మేనా అనే సంశయం వార్ని పట్టి పీడిస్తోంది. ఆ దివ్య తేజస్సు, ఆ దివ్యకాంతి సామాన్యులకు అసాధ్యం అనిపిస్తున్నా, ఏదో మూల వార్ని సందేహం వదలకపోవటాన్ని గ్రహించిన స్వామి "పరీక్షించుకోండి భక్తులారా, మీ సంశయాల్ని పటాపంచలు చేసుకోండి" అని ప్రోత్సహించాడు.

దాంతో కృష్ణ " స్వామి! నా భార్య ప్రస్తుతం అనారోగ్యంతో వుంది. మంచంమీంచి లేవలేని స్థితిలో వుంది. నువ్వు అనుగ్రహించదలచుకుంటే నా భార్యకి సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించు" అన్నాడు.

స్వామి "తథాస్తు" అన్నాడు. అంతే కొద్ది సమయం గడిచిందో లేదో శ్రీరామ్ నుండి" కృష్ణ! అద్భుతం, నీ భార్య సంపూర్ణ ఆరోగ్యవంతురాలయింది. లేచి తన పనులు తాను చేసుకుంటోంది. మా కళ్ళని మేము నమ్మలేకపోతున్నాము. నువ్వు త్వరగా ఇంటికి రా" అని కృష్ణకి ఫోన్ రాగ, ఆ వార్తకి కృష్ణ, గోవింద్ లు ఆనందపారవశ్యంలో మునిగిపోయారు. గొంతు తడబడుతోంది, కళ్ళనుండి నీళ్ళు ధారాపాతంగా కారుతుండగా శ్రీరామ్ తో తర్వాత వస్తామని చెప్పి స్వామిని తేరపార చూస్తుండగా స్వామి " ఏమి భక్తులారా? మీకు నమ్మకం కుదిరినట్లేనా? మరో విధంగా కూడా ఏమైనాపరీక్షించుకుంటారా?" అని చిరునవ్వుతో అడిగాడు.

“మేము నమ్మలేకపోతున్నాం స్వామి, నీమీద నమ్మకం లేక కాదుకాని ఎందుకో ఇదంతా వాస్తవమేనా అనే సంశయం మమ్మల్ని తొలచివేస్తోంది. నువ్వు అన్యథా భావించకపోతే మమ్మల్ని తక్షణం మేము ఇంతవరకు చూడని అద్భుతప్రాంతానికి తీసుకువెళ్ళు” అన్నాడు గోవింద్.

“అవశ్యం” అన్నాడు స్వామి. అంతే మిత్రులు ఇద్దరూ ఇంతకుముందు ఎప్పుడూ కనీ విని ఎరగని ఒక సుందర అద్భుత ప్రాంతంలో వున్నారు. వీరువున్న ప్రాంతం చుట్టూ విశ్వమంతా పరిభ్రమిస్తుంది. సూర్య,చంద్ర,నక్షత్ర మండలాలు, నవగ్రహాలు వీరి చుట్టూ తిరుగుతూ దర్శనమిస్తున్నాయి. ఆ ఆహ్లాదకరప్రాంత వాతావరణానికి వారి మనస్సులు ఆనంద పారవశ్యంలో తేలియాడుతున్నాయి. వారికి స్వామి మీద పూర్తి విశ్వాసం ఏర్పడింది.

“ఏమి భక్తులారా? మీ పరీక్షలో నేను ఉత్తీర్ణుడినయ్యానా?” అని చిరునవ్వులు చిందిస్తూ వారి ఎదుట దర్శనమిచ్చాడు.

“క్షమించండి స్వామి, అజ్ఞానంతో, అవివేకంతో నిన్ను ఇలా పరీక్షించినందుకు ఈ అల్పుల్ని ఆగ్రహించక అనుగ్రహించు” అని తన్మయత్వంతో కూడిన వేదనతో వేడుకున్నారు.

“మిమ్మల్ని అనుగ్రహించటానికే కదా మీకు దర్శనమిచ్చాను. ఇప్పుడు మీ బాధ ఏమిటో వెల్లడించండి” అన్నాడు స్వామి.

“ఏముంది స్వామి, పిల్లల్ని కని పెంచి పెద్దజేసి ప్రయోజకుల్ని చేసాము. అందుకు అడ్డమైన గడ్డీ తిన్నాం. ఈ రోజు వాళ్ళకి మా ఆస్తిపాస్తులు కావాలి కాని, మేము అవసరంలేదు. కన్నందుకు ఎవరికోసం పెంచుతారు అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. డబ్బు అవసరాలకి తప్ప మేము వారికి కనపడటం లేదు. మేము వాళ్ళదగ్గరకి వెళ్ళినా, వాళ్ళు మా వద్దకు వచ్చినా, వాళ్ళు మానుంచి కోరేది డబ్బే. ఒక్కనాడు కూడా వాళ్ళని కనిపెంచిన విశ్వాసంతో మమ్మల్ని ప్రేమగా పలకరించటానికి రాలేదు, పిలవలేదు. ఎంతసేపు వాళ్ళ సరదాలు, సుఖాలు. మా జీవితాల్ని త్యాగం చేసి వాళ్ళని పెంచాము. అందుకు లభిస్తున్న ఫలితం ఛీత్కారం. పైగా వాళ్ళలో ప్రేమను మొలకెత్తే విధంగా పెంచలేదని మామీద మరో అభియోగం. ఈ పరిస్థితిలో మాకు బాధ కాక మరింకేమి వుంటుంది స్వామి” అని మిత్రులు వాపోయారు.

“ఇంత అల్ప విషయానికి అంత అధికంగా బాధపడుతున్నారా?” అని చాలా తేలిగ్గా కొట్టిపారేస్తూ అన్నాడు స్వామి.

“అదేమిటి స్వామి ఇది అంత చిన్న విషయంగా భావిస్తున్నావు!” అని ఆశ్చర్యాన్ని ప్రకటించారు మిత్రులు.

“అవును భక్తులారా నా బాధ ముందు మీ బాధెంత” అన్నాడు స్వామి.

“నీకూ బాధా స్వామి!” అని ఆశ్చర్యపోయారు మిత్రులు.

“అవును భక్తులారా, నేను మీవంటి బాధనే అనాదిగా అనుభవిస్తున్నాను. అందుకే మీతో పంచుకుందామని వచ్చాను” అన్నాడు స్వామి.

“మావంటి బాధా! మేమంటే మా సంతానం గురించి కలత చెందుతున్నాము. వారి చేతిలో మోసపోయినందుకు విలపిస్తున్నాము. నువ్వు సృష్టి, స్థితి, లయకారకుడివి. నీకు బాధేమిటి

స్వామి మరీ విచిత్రం. అయినా నీకే బాధ వుంటే మా బాధలు తీర్చేదెవరు?” అని ప్రశ్నించారు మిత్రులు.

అందుకు స్వామి “ ఎంత చెట్టుకు అంతగాలన్నట్లు, మీస్థాయికి తగ్గ బాధ మీకుంటే, నాస్థాయికి తగ్గ బాధ నాకుంటుంది” అన్నాడు.

“స్వామి! నీ అంతరంగం మాకవగతం కావటం లేదు. ఈ సకల చరాచర సృష్టికి మూలకారకుడవయిన నీకూ కోరికలు, బాధలు వుండటం ఏమిటి? అజ్ఞానాంధకారంలో జీవిస్తున్న మాకు కాస్త అర్థమయ్యే రీతిలో వివరించు” అని ప్రాధేయపడ్డారు.

“అవశ్యం భక్తులారా! సంతానానికి ఆయా లక్షణాలు ఎలా ప్రాప్తిస్తాయో చెప్పండి” అని స్వామి ప్రశ్నించారు.

“తల్లిదండ్రులు లేదా తాతముత్తాత, ఇతర రక్తసంబంధీకుల నుండి సంప్రాప్తిస్తాయి”అన్నారు మిత్రులు.

“అవును కదా, మరి ఈ బాధ, సుఖం, కష్టం, దయ, ప్రేమ, కోరిక లాంటి లక్షణాలన్నీ మీకు ఎక్కడ నుంచి వస్తున్నాయని భావిస్తున్నారు. నాలోవున్న అనంతకోటి గుణాలలో వారివారి సంస్కారాలననుసరించి జీవులకు ప్రాప్తిస్తూ వుంటాయి. మీరంతా నా సంతానం. చీమకు చీమంత, బ్రహ్మకు బ్రహ్మంత అన్నట్లు మీకు ప్రాప్తించిన లక్షణాలకు తగ్గట్లుగా మీకు బాధ, సుఖం ఇత్యాదులుంటే, నా స్థితికి తగ్గట్లుగా నాకూ తీరని కోరికలు, బాధని కల్గించే అంశాలు లాంటివి వుంటూనే వుంటాయి.” అని వివరిస్తూ “ఇప్పుడు మీకొక దృశ్యం చూపిస్తాను, వీక్షించండి” అని ఆ మిత్రులకి గత కొన్ని సంవత్సరాల క్రితం ఈ మిత్రులు లైబ్రరీ వద్ద జరిపిన వాదనా దృశ్యాన్ని దర్శింపజేసాడు. ఆ మిత్రులు ఆ రోజు యవ్వనదశలో అజ్ఞానంతో మాట్లాడిన మాటలకు సిగ్గుతో తలలు వంచుకున్నారు.

“ఏం భక్తులారా, చూశారా నాటి దృశ్యాన్ని? విన్నారా మీ వాదనా పటిమని? ఏమన్నారు? నాకు కోరికలు, బాధలు వుండవా? అంత వ్యయప్రయాసలతో నా వద్దకు వచ్చేది నేను కోరికలు తీరుస్తాననే ఆశతోనేనా? నా మీద ప్రేమ కల్గేటట్లు నేనే మిమ్మల్ని మలచుకోవాలా? మరి ఈ నాడు మీ సంతానం కూడా అంతేగా ప్రశ్నిస్తున్నారు? మీరు మీ కోరికలు తీరాలని నావద్దకు ఎలా వస్తున్నారో అలాగే మీ సంపదకోసం మీ సంతానం మీ వద్దకు వస్తున్నారు. నేను కోరికలు తీర్చానని, ఇంకా తీరుస్తానని మీరెలా ఆశపడ్తున్నారో, మీ సంతానం మీ ఎడ అలాగే ప్రవర్తిస్తున్నారు. మరి దీనికి మీరెందుకు అంతగా విచారిస్తున్నారు?” అని భగవంతుడు నిలదీసేసరికి మిత్రులకు నోటమాట రాలేదు.

“మీరు ఈ జన్మలో మీకు కల్గిన అల్ప సంతానాన్ని పెంచి పెద్దచేసి, వాళ్ళు మిమ్మల్ని ప్రేమగా చూడటం లేదని, వారి చేతిలో మోసపోయామని ఆందోళన చెందుతున్నారే మరి నేను మీచేతిలో కొన్ని కోటానుకోట్ల సంవత్సరాల నుండి, అనేక లక్షల జన్మలు మీకు కల్గించి మీచే మోసపోతూనే వున్నాను. ఏ జన్మలోనైనా మీరు మారి నా అభీష్టంమేర ప్రవర్తిస్తారని ఆశతో ఎదురుచూస్తున్నాను. ఈ సృష్టిలోని ఈ సంపదనంతా సృష్టించింది మీరనుభవిస్తారనే కదా. కాని మీరు ఆలయాలకు వచ్చినా, మీ గృహాల్లో పూజాదులు నిర్వహిస్తున్నా మీరు కోరుకునేది నా సంపదనే తప్ప, మీకు ఇంత మంచి జన్మని ప్రసాదించాననే కృతజ్ఞత ఏనాడైనా నాపై చూపించి నన్ను సేవిస్తున్నారా? మీకు మీ సంతానం ఎలాంటి విలువిస్తున్నారో, మీరు నాకు ఇస్తోంది అంతేగా?”

“ ఈ జన్మలో వీళ్ళు మీ సంతానము. ఇలాంటి జన్మలు మీకు బహు గడిచాయి. ఇంకా ఎన్నో గడుస్తాయి. ప్రతి జన్మలోను యిలాంటి శారీరక బంధుత్వాలు ఏర్పడుతూనే వుంటాయి. ఈ శరీరాల్ని త్యజించగానే ఆ బంధుత్వాలు పటాపంచలు అయిపోతాయి. మీరు

ఈ శరీరము ద్వారా అనుభవిస్తున్న సుఖదుఃఖాల ఫలితాల్ని అనుభవించేది మీ ఆత్మ. మీ ఆత్మానందం కోసం మీ శరీరాలు ఎలా ఉపయోగపడుతున్నాయో, అలాగే నా ఆనందం కోసం, నా తృప్తి కోసం, నాకు సర్వ విధకైంకర్యాలు చెయ్యటం కోసమే ఈ ఆత్మలన్నీ ఉపయోగపడాలి. అలా జీవించటాన్నే ఆత్మోజ్జీవనమంటారు. కాని మీరు జంతువుల్లాగా జీవిస్తున్నారు. నటించవలసిన సంసారంలో జీవిస్తున్నారు, జీవించవలసిన నాకు సంబంధించిన అంశాలలో నటిస్తున్నారు. మీకు శరీరాలతో వున్న సంబంధాలన్నీ తాత్కాలికం, క్షణభంగురం. ఏ క్షణాన ఆ బంధం త్రెగుతుందో తెలియని దాని కోసం మీరు అర్రులు చాస్తూ, మీ ఉన్నతమైన జన్మల్ని వృధా చేసుకుంటున్నారు. ఈ ఆత్మలు మానవ శరీరంలో ప్రవేశించటం వలన మీకు కొన్ని బంధాలు తద్వారా కొన్ని బాధ్యతలు, విధులు ఏర్పడతాయి. వాటినుంచి తప్పించుకుని తిరగమని నేను ఉపదేశించలేదు. అయితే ఆ బంధాల చక్రంలో యిరుక్కుపోయి గిలగిల లాడుతున్న మీ దుస్థితిని చూసి నేను బాధ పడుతున్నాను. మీ భార్యా, పిల్లలకి మీరు సదుపాయాలు సమకూర్చాలి, అది మీ బాధ్యతే. అయితే అదే మీ గమ్యం, లక్ష్యం కారాదనే విషయాన్ని మీరు గ్రహించక మీ జీవిత సమయాన్నంతా వారిని సంతృప్తిపరచటం కోసం నానా కష్టాలు పడి, అనేకరకాల అడ్డదార్లలో పయనించి, అక్రమాలకు పాల్పడుతూ అంతులేని సంపదని సంపాదించటమే మీ ఏకైక లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. కాని మీరు ఈ జన్మని చాలించాకా ఆ సంపదలో ఒక్క చిల్లిగవ్వ కూడా మీతో రాదని గ్రహించటంలేదు. ఇప్పుడు మీరు మీ జీవితం చివరి దశకు చేరుకున్నారు. ఒక్కసారి మీ జీవితంలో మీరు ఏమి సాదించారో, అది మీకు ఎంతగా ఉపయోగపడుతుందో ఆలోచించండి. మీరు చేసుకున్న పుణ్యఫలితంగా మీకీ జన్మ లభించింది. దాన్ని నిరర్ధపరచుకున్నారు. ఇప్పుడు పశ్చాత్తాపపడి ఏం ప్రయోజనము? మీరు ఎవరికోసం ఇంత కాలం శ్రమించారో వాళ్ళే మిమ్మల్ని నిలదీస్తున్నారు. మీ మిత్రుడ్ని చూడండి. తన జీవితాన్ని ఎలా సార్ధకం చేసుకున్నాడో. నా మీద సర్వభారాలు వేసి, నాకు శరణాగతులయి, నన్ను విశ్వసించిన మీ మిత్రులవంటి వాళ్ళ బాగోగులు నేనే చూసుకుంటాను. వారికి ఎలాంటి కష్టాలు కల్గనివ్వను మీకు అనాది నుండి నాతోనే సర్వవిధ సంబంధాలు కల్గి వున్నాయి. ఈ జీవులందరికి తండ్రిని నేనే. మీ అందరి సర్వ భారాల్ని భరించే భర్తని నేనే. మీరందరూ నాకు పరతంత్రులు. ఈ చరాచర సృష్టిలోని ప్రతి వస్తువు నాకు చెందిందే. నేనే అన్నిటికి స్వామిని. అనేకానేక బ్రహ్మాండాలు, గ్రహాలు, సూర్యచంద్రులు, భూమ్యాదులు వాటి వాటి కక్ష్యలో నియమానుసారంగా పరిభ్రమిస్తున్నాయంటే, వాటికి ఆధార భూతుడ్ని నేనే. మీమీ సంపదలకు, వంశానికి, సాంప్రదాయానికి, వారసులవుతారని మీరు సంతానాన్ని ఎలా కంటున్నారో, అలాగే ఈ సకల సృష్టిలోని నా సంపదను, నా వైభవాన్ని తరతరాలకి అందిస్తారని, నేను అందించిన వేదాల్ని, ఇతిహాసాల్ని, పురాణ వాఙ్మయాన్ని యావత్ మానవాళికి నిరంతరం అందిస్తూ నాకు వారసులవుతారని మిమ్మల్ని సృష్టిస్తున్నాను.”

“ మీ ప్రవర్తన మీ సంతానం మీద సంస్కార రూపంగా ప్రవేశించి పెద్దదై తదనుగుణ ఫలితం ఇస్తుందనే విషయాన్ని మీరు గ్రహించక, మీరూ ఒకప్పటికి వృద్ధులవుతారనే జ్ఞానం లేక, మీ యవ్వన దశలో మీ తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించి నేడు ఈ రకంగా మీ సంతానం ప్రవర్తించటానికి కారకులయ్యారు. మీ స్నేహితుడ్ని చూడండి, తన యుక్తవయస్సులో వుండగా తన తల్లిదండ్రుల్ని ప్రత్యక్ష దైవాలుగా భావించి వారికి శుశ్రూష చేసాడు. తత్ఫలితంగా ఈ రోజు తన సంతానం ద్వారా ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. మీరు ఎలా ప్రవర్తించాలి, మీరు తరించటానికి ఏ పద్ధతులు అవలంభించాలి అనే విషయాల్ని మీకు అనేక మంది భక్తుల శ్రీసూక్తుల ద్వారా, వారి జీవితాల ద్వారా తెలియజేసాను. ఎంతో వాఙ్మయాన్ని అందించాను. అంతేకాదు చివరకు నేనే అవతరించి ఆచరించి చూపించాను. నేను శ్రీరాముడుగా ఎందుకు అవతరించానో చెప్పండి” అని స్వామి ప్రశ్నించారు.

అందుకు సమాధానంగా మిత్రులు “ రావణ, కుంభకర్ణాదుల వధ నిమిత్తం అవతరించావు స్వామి” అన్నారు.

అందుకు స్వామి చిరుమందహాసంతో “అందుకే అవతరించినట్లైతే, రావణాదుల వధ నేను అవతరించిన ముప్పై ఎనిమిదవ సంవత్సరంలోగా పూర్తయింది. కాని నేను శ్రీరాముడుగా ఈ భువిపై పదకొండువేల సంవత్సరాలు అవతరించి వున్నాను. ఎందుకని?” అని స్వామి ప్రశ్నిస్తే మిత్రులు సమాధానం చెప్పలేకపోయారు. దాంతో స్వామే “ మీకు మానవత్వం అంటే ఏమిటో? తరించాలంటే మానవుడు ఎలా ప్రవర్తించాలో తెలియజేయటానికి నేను అనేక కష్టనష్టాల్ని భరించి మీకు మార్గాన్ని సుగమనం చేసాను” అన్నాడు స్వామి.

“ స్వామీ నువ్వంటే పరమాత్మవి, దేవుడివి. నీకు అసాధ్యమైనది లేదు. నువ్వు ప్రవర్తించిన విధంగా మాలాంటి సామాన్య జీవులం ఎలా జీవించగలం” అని సందేహాన్ని వెలిబుచ్చారు మిత్రులు.

“నేను నరుడుగా శ్రీరాముడుగా అవతరించి ఎక్కడైనా దైవత్వాన్ని ప్రదర్శించానా? నేను దైవత్వమే ప్రదర్శిస్తే నా సీతను ఆ రావణుడు అపహరించగలడా? నా సీతాన్వేషణకు నేను అంతగా విలపిస్తానా? నాకు సహాయపడమని వానరులను అర్థిస్తానా? సముద్రుణ్ణి మార్గం ఇవ్వవలసిందిగా శరణాగతి చేస్తానా? సంకల్పమాత్రాన ఒక్క క్షణంలో లంకలో ప్రవేశించలేనా? రావణుడితో అంత సంగ్రామం జరపాలా? నా సీతను అగ్ని పరీక్షకు గురిచేయాలా? ఎవడో అనామకుడు వేసిన అపనిందకు నా సీతను త్యజించాలా? ఇవన్నీ దైవత్వానికి సంబంధించిన అంశాలా? నేను మీకు ఆదర్శప్రాయుడుగా నిలవాలని అవతరిస్తే, నా ప్రయత్నాన్ని మీరు ఎలా నీరు కారుస్తున్నారో కదా? ” అని స్వామి కలత చెందాడు.

“ఎందుకు స్వామీ అలా బాధ పడతావు. నువ్వు అవతరించి మా కోసం అష్ట కష్టాలు చవిచూసావనేకదా మా అందరికి ఆరాధ్యదైవం అయింది. ఈ దేశంలో రామాలయం లేని గ్రామం లేదంటే నమ్ము స్వామీ. శ్రీరామనవమి ఉత్సవాలు రంగ రంగ వైభవంగా జరిపిస్తూ నీకు నిత్య కళ్యాణాలు చేస్తున్నాము. శ్రీరామకోటిని లిఖిస్తున్నాము. ఏ కార్యం ప్రారంభించటానికి ముందైనా శ్రీరామ అంటూ ప్రారంభిస్తున్నాము. శ్రీరాముడే మా ప్రాణంగా భావిస్తున్నాము” అని ఉపన్యసించారు మిత్రులు.

అందుకు స్వామి “అదా నా అవతార ప్రయోజనం, దేవుడు అనిపించుకుని మీకు దూరమవ్వటానికా నేను రాముడిగా మానవుడిగా అవతరించింది. అన్ని కష్టాల్ని, అగచాట్లని, నిందల్ని మోసింది దైవత్వం కోసమా? నేను అనుసరించి చూపితే మీరు ఆ దిశగా అడుగులు వేస్తారని ఆశిస్తే మీరు అర్థం చేసుకుంది యిదా? వితండవాదం చేస్తూ మీరు మానవత్వానికి దూరం అవుతున్నారు. ఆ యుగధర్మం వేరు అంటున్నారు. కనీసం ఆ దిశగా ప్రవర్తించే ప్రయత్నమైనా చేయకుండా, ప్రయత్నించేవార్ని అవహేళన చేస్తున్నారు. మానవరూపం ధరించి దానవులకంటే ఘోరంగా ప్రవర్తిస్తున్నారు. ఆ నాడు నేనే కాదు, ఈ నాడు కూడా నన్ను ఆదర్శంగా తీసుకుని జీవిస్తున్నవారు మీకు సమీపంలోనే అనేకమంది వున్నారు. మీరు వారిని గుర్తించలేకపోతున్నారు. ఉదాహరణకు మీ మిత్రుడ్ని చూడండి, అతనూ మీ తోటి మానవుడే కదా? మీతో పాటు ఈ యుగంలో ఈ సమాజంలోనే జీవిస్తున్నాడు కదా? మీలాంటి వృత్తే చేస్తున్నాడుగా? ఏం అతను ఆదర్శప్రాయుడుగా, ఆనందదాయకంగా జీవించటం లేదా? నా శ్రీరామ అవతార ప్రయోజనాన్ని గుర్తించక నన్ను క్షోభకి గురి చేస్తున్నారు” అని స్వామి తన బాధకి కారణాల్ని విశ్లేషించి వివరించారు.

అంతా విన్న మిత్రులకి కళ్ళవెంట దారాపాతంగా నీళ్ళు స్రవించాయి. “స్వామీ, నీకు ఆలయాలు నిర్మించి, నీకు పూజాదులు చేయటమే నీకు చూపే కృతజ్ఞతగా ఇంతకాలం భావించాం. మేము ఏ రకంగా ప్రవర్తిస్తే నీకు ఆనందం కల్గి, నీ అవతార ప్రయోజనానికి కారకులమవుతామో ఆజ్ఞాపించు స్వామి” అని వేడుకున్నారు.

"మీ హృదయ కోవిలలో శ్రీరాముడ్ని ప్రతిష్ఠించండి. నాకు నిజమైన ఆలయం మీ హృదయమేనని గుర్తించండి. శ్రీరాముడిగా నేను అనుసరించి చూపిన గుణాల్ని మీరు ఆచరణలో పెట్టటమే నాకు మీరు చేసే నిజమైన అర్చన. అప్పుడు గ్రామానికో రామాలయం కాదు, అనేక వేలాది వేల రామమందిరాలు ప్రతిష్ఠించిన వారవుతారు. అదే నా అవతార ప్రయోజనము, అప్పుడే నాకు సంతృప్తి" అని స్వామి ఆ మిత్రులకు శ్రీరామ తత్త్వాన్ని భోదించాడు.

"స్వామి! మా కళ్ళు తెరిపించావు, మమ్మల్ని అనుగ్రహించావు. అయితే మమ్మల్ని కొన్ని సంశయాలు అనాదిగా వేదిస్తున్నాయి. వాటిని నివృత్తి చేయగల సామర్థ్యం నీకు మాత్రమే వుంది. నువ్వు అనుమతిస్తే వాటిని వెల్లడిస్తాము" అన్నారు మిత్రులు.

అందుకు స్వామి చిరునవ్వుతో "అవశ్యం.....నిస్సంకోచంగా మీ సంశయాల్ని వెల్లడించండి" అన్నాడు.

అప్పుడు మిత్రులు " స్వామీ, నువ్వు సర్వశక్తిమంతుడివి కదా! మేము నీకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ దూరమవుతున్నాం అంటున్నావు. అంతా నీ సంకల్పమే కదా, నీ లీలలో భాగమే కదా? మేము నిమిత్తమాత్రులము కదా? అలాంటి పరతంత్రులమైన మా మీద నింద ఎందుకు మోపుతావు " అని తమ ధర్మసందేహాన్ని వెలిబుచ్చారు.

"నిజమే భక్తులారా! మీరు వెల్లడించింది అంతా యదార్థమే. మీకొక సంఘటన చూపిస్తాను వీక్షించండి" అని ఒక ప్రాంతంలో అప్పుడే ప్రాకటం వచ్చిన ముద్దులొలికే ఒక పసిపాపను తండ్రి తన వద్దకు రమ్మని పిలుస్తుంటే, ఆ పాప బోసినవ్వులు నవ్వుతూ తండ్రివద్దకు ప్రాకుతూ రావటానికి ప్రయత్నించిందో లేదో వెంటనే తండ్రి అమాంతం తనే ముందుకెళ్ళి ఆ పాపను ఎత్తుకుని ముద్దాడుతున్న దృశ్యాన్ని ఆ మిత్రులకు చూపి "వీక్షించారా భక్తులారా? ఆ తండ్రి తన వద్దకు వస్తున్న పాపను తనే ఎదురెళ్ళి ఎందుకు ఎత్తుకున్నాడు?" అని ప్రశ్నించాడు స్వామి.

"ఆ పాప ప్రాకుతూ వచ్చే ప్రదేశం రాళ్ళురప్పలతో వుండటం వలన ఆ పాప శరీరం గాయాలకు గురవుతుందని" అని సమాధానమిచ్చారు మిత్రులు.

"ఆ ప్రదేశం అలావుందని తెలిసికూడా ఎందుకు పిలిచాడు" అని స్వామి ప్రశ్నించాడు.

"అసలు తన వద్దకు వస్తుందో? రాదో? తెలుసుకుని, రావటానికి ప్రయత్నించే సరికి తానే చొరవతీసుకుని అక్కున చేర్చుకున్నాడు" అన్నారు మిత్రులు.

"వాస్తవాన్ని గ్రహించారు. మరి అటువైపు వీక్షించండి" అంటూ మరో ప్రాంతంలోని తండ్రిబిడ్డల్ని చూపించాడు. ఆ పాపకూడా ముద్దులుమూటకడ్తూ, అప్పుడప్పుడే చిన్నిచిన్ని అడుగులు వేస్తోంది. ఆ బిడ్డ తండ్రి, ఆ పాపని తనవైపు ఆకర్షించుకోవాలని రకరకాల ఆటవస్తువులు, రంగురంగుల బొమ్మలు, తినుబండారాలను చూపిస్తూ ప్రయత్నిస్తున్నాడు. కాని ఆ పాప వేటికి ఆకర్షితురాలు కాక, తండ్రివద్దకు వెళ్ళే ప్రయత్నం చేయక, మరోవైపు అడుగులు వేస్తోంది. దాంతో తండ్రి తన ముచ్చటని చంపుకోలేక ఆ పాపని బలవంతంగా ఎత్తుకుంటే, తను గింజుకుంటూ ఏడుస్తూ, మొరాయిస్తూ క్రిందకి జారిపోతుంది. దాంతో ఆ తండ్రి చేసేదిలేక ఆ పాపని క్రిందకు దింపేసాడు.

"భక్తులారా! అంత ముచ్చటపడి ఆ పాపని ఎత్తుకున్న తండ్రి అలా ఎందుకు దింపేసాడు" అని స్వామి వారు అడగ్గా, మిత్రులు " ఏం చేస్తాడు స్వామి, తనంతట తాను రాకపోయినా,

తానే చొరవ తీసుకుని ఎత్తుకున్నా ఆ పాప అనుకూలంగా లేకుండా మొరాయిస్తుంటే, ఇక చేసేదిలేక తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు" అని వివరించారు మిత్రులు.

"అవును కదా! మరి మీ విషయంలో నా ప్రమేయం కూడా అంతే. మీరు నాకు అనుకూలంగా, అభిముఖంగా అడుగులు వేయాలని నాకు ఆకర్షితులు కావాలని నేను వివిధ అవతారాలతో, వివిధ రూపాలతో మీకు దర్శనమిస్తున్నాను. నా దివ్య కథలకి మీరు వశమవుతారని నా వైభవాన్ని తెలిపే సకల శాస్త్రాల్ని అనుగ్రహించాను. మీరు నా దిశగా ఒక్కడుగు వేస్తే నేనే ముందుకు వచ్చి నా దరి చేర్చుకుందామని ఎన్నో కోటాను కోట్ల సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్నాను. కాని మీరు వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంటే నేను బలవంతంగా మిమ్మల్ని నా వద్దకు చేర్చుకున్నా, ఆ పిల్లవాడిలాగా మీరు ఆనందంగా వుండలేరు. అంతెందుకు మీ విషయమే చూడండి. మీకు నేను దర్శనమివ్వాలని, మిమ్మల్ని అనుగ్రహించి తరింపజేయాలని ఎన్నాళ్ళుగానో వీక్షిస్తున్నాను. ఎప్పుడు మీరు నాకు అభిముఖంగా ప్రవర్తిస్తారా? ఆ మిషతో నా ముచ్చట తీర్చుకుందామా అని ఆశతో ఎదురుచూస్తుంటే ఇప్పటికి మీ జీవితం చివరిదశకు చేరాక మీనుండి సంకేతం అందింది. అంతే అదే అదునుగా మీకు ప్రత్యక్షమయ్యాను" అని వివరించాడు స్వామి.

"ధన్యోస్మి స్వామి.........ధన్యోస్మి మాపై నీవు చూపించిన కరుణకు మేము సర్వదా కృతజ్ఞతతో వుంటాము. స్వామి మాకు మరొక చిన్న సందేహం వుంది, అది కూడా నీవే నివృత్తి చెయ్యాలి" అన్నారు మిత్రులు.

"తప్పకుండా, అడగండి భక్తులారా" అన్నాడు స్వామి.

"స్వామి, నీకు శరణాగతులు అయిన వారి బాధ్యత నీవే వహిస్తానని చెప్పావు కదా? నిన్నే నమ్ముకుని ఆరాధిస్తున్న నీ భక్తులు కొందరు అనేక కష్టాలకి గురవ్వటం చూస్తున్నాము. అందుకు కారణమేమిటి?" అని సందేహ నివృత్తి కోసం అడిగారు.

అందుకు స్వామి "చక్కటి సందేహాన్ని వెలిబుచ్చారు" అని "అటు చూడండి" అంటూ ఒక ప్రదేశంలో ఒక ఇల్లాలు బాగా మసిపట్టిన ఒక పాత్రని పీచుతో తోముతున్న దృశ్యం చూపించి " భక్తులారా ఆ ఇల్లాలు ఆ పాత్రని ఎందుకు అలా తోముతోంది" అని ప్రశ్నించాడు.

"ఎన్నాళ్ళుగానో ఆ పాత్రకి పట్టిన మసిని వదల్చటానికి స్వామి" అని సమాధానం ఇచ్చారు మిత్రులు.

" మరి అటు చూడండి" అంటూ మరో ప్రాంతంలో ఒక వస్త్రాన్ని ఒక ఇల్లాలు బండకేసి బాదుతున్న దృశ్యాన్ని చూపించి దాని అర్థం ఏమిటన్నట్లు స్వామి మిత్రుల వంక చూడగా, అందుకు సమాధానంగా మిత్రులు " ఆ వస్త్రం బాగా మురికి పట్టి వుంది.దాన్ని వదిల్చే ప్రయత్నం చేస్తోంది స్వామీ" అన్నారు.

" ఆ పాత్రకి పట్టిన మసిని, ఆ వస్త్రానికి పట్టిన మురికిని వదల్చటానికి ఆ ఇల్లాళ్ళు చూసారా ఎంత కృషి చేస్తున్నారో, మరి ఎన్నో కోటానుకోట్ల జన్మల నుండి మీ ఆత్మలకి పట్టిన మాలిన్యాన్ని తొలగించి నాదగ్గరకు మిమ్మల్ని చేర్చుకునే ప్రయత్నంలో భాగమే మీరు అనుభవించే కష్టాలు. నా భక్తులు కష్టాలు అనుభవిస్తున్నారంటే దాని అర్థం నా అనుగ్రహానికి పాత్రులవుతున్నారనే భావించాలి" అని స్వామి వివరించగా, మిత్రులు " స్వామి, నీవు నిజంగా మమ్మల్ని నీ దరి చేర్చుకోవాలనుకుంటే, నీకు అడ్డేమిటి? ఇన్ని జన్మల కాలం వేచిచూడటం దేనికి? క్షణంలో మమ్మల్ని నీ అక్కున చేర్చుకోవచ్చు కదా?" అని సందేహాల్ని సంధించారు.

అప్పుడు స్వామి " మీరన్నదానిలో వాస్తవం లేకపోలేదు. అయితే ఒక్కసారి అటుచూడండి" అంటూ మరో ప్రదేశంలో ఒక దృశ్యాన్ని ఆ మిత్రులకు చూపించాడు. అక్కడ ఒక పిల్లవాడు తన తండ్రిని ఎత్తుకోమని మారాం చేస్తూ కాళ్ళుపట్టుకుని లాగుతున్నాడు. ఆ తండ్రికి కూడా ముద్దువచ్చి ఎత్తుకుందామనుకున్నాడు. కాని ఆ పిల్లవాడు మలమూత్రాలు చేసి వళ్ళంతా పులుముకున్నాడు. దానితో ఆ పిల్లవాడ్ని శుభ్రపరచి యిమ్మని తన భార్యని ఆదేశించాడు. ఆ ఇల్లాలు వాడి వస్త్రాలు తొలగించి నీటితో శుభ్రపరుస్తుంటే చలికి ఏడుపు లంకించుకున్నాడు. అయినా ఆ తల్లి వాడ్ని శుభ్రపరచి మంచి వస్త్రాలు ధరింపజేసి భర్తకి అందిస్తున్న దృశ్యాన్ని మిత్రులకు చూపుతూ " ఏమి భక్తులారా? ఆ తండ్రికి ఆ పిల్లవాడ్ని ఎత్తుకునే శక్తి లేదా? ఎందుకు వెంటనే గుండెలమీదకు తీసుకోకుండా అంత జాగు చేసి, వాడ్ని ఆ చలిలో అంత బాధ పెట్టి, ఏడిపించి ఎప్పటికో దగ్గరకు తీసుకున్నాడు" అని ప్రశ్నించాడు స్వామి.

" ఇది మరీ బాగుంది స్వామి, ఎంత తన పిల్లవాడయినా, ఎంత ముద్దొచ్చినా, అలా మలమూత్రాలతో వున్న శరీరంతో ఎలా దగ్గరకు తీసుకుంటాడు? తన దరి చేర్చు కోవాలనే కదా శుభ్రపరిపించి దగ్గరకు తీసుకుని ముద్దాడుతున్నాడు." అని చాలా తెలివిగా సమాధానం చెప్పామనుకుంటున్నారు.

"మరి నేను చేస్తున్నది కూడా అదేగా భక్తులారా, మీరు ప్రకృతికి వశమయి, విషయాలనే మలాల్ని మీ ఆత్మలకి పులిమేశారు. వాటిని సంస్కరించకుండా ఎలా నా దగ్గరకు చేర్చుకుంటాను చెప్పండి?" అని సమాధాన పరిచాడు స్వామి.

స్వామి వివరంగా, విపులంగా, విశ్లేషాత్మకంగా చేసిన తత్త్వోపదేశానికి మిత్రులు ఆనందపరవశులయ్యారు. వాళ్ళ కళ్ళు చెమర్చాయి. గద్గద కంఠంతో " స్వామీ, మా సందేహాలన్నీ మటుమాయమయ్యాయి. మామీద నువ్వు చూపిన వాత్సల్యానికి మా మనస్సులు ఆనందంతో నాట్యం చేస్తున్నాయి. మా జీవితకాలంలో ఏనాడు నిన్ను మనస్ఫూర్తిగా స్మరించలేదు. అలాంటి ఈ దుర్మార్గులపై నీకెందుకు ఇంత అనుగ్రహం కల్గింది" అని అడిగారు మిత్రులు.

"మీరు చేసుకున్న ఏకైక సుకృతం, అదేమిటో తెలుసా? నా భక్తుడికి మీరు స్నేహితులు కావటమే. నా భక్తుడు మీ ఉజ్జీవనం కోసం నన్ను నిత్యం ప్రార్థించటం. అందుకే మిమ్మల్ని అనుగ్రహించాను. నా భక్తుల్నే కాదు వారితో సంబంధం కల్గి వున్న అందర్ని నేను తరింపజేస్తాను, ఇది నా వ్రతం" అన్నాడు స్వామి.

"స్వామి! అలాంటి ఉన్నత, ఉత్తమ మిత్రున్ని మాకు ప్రసాదించి, మమ్మల్ని ధన్యుల్ని చేసావు. ఈ అల్పులకి, అధములకి ఎంతో ఉత్కృష్టమైన నీ తత్త్వాన్ని ఉపదేశించావు. ఎందుకు స్వామి" అన్నారు మిత్రులు.

"నేను ఎప్పుడూ ఏదోరకంగా ఎవర్నో ఒకర్ని మిషగా చేసుకుని నా తత్త్వాన్ని ఉపదేశిస్తూ వుంటాను. కపిలుడుగా అవతరించి నా తల్లి దేవహూతికి సాంఖ్యతత్త్వాన్ని ఉపదేశించాను. కురుక్షేత్రసంగ్రామంలో అర్జునుడి విషాదాన్ని మిషగా చేసుకుని సమస్త జనులకు భగవద్గీతని అందించాను. తర్వాత ఉద్ధవుడికి ఉపదేశించాను. ఇలా అవకాశం లభించినప్పుడల్లా జీవులు తరించటానికి నా తత్త్వాన్ని అందిస్తూ, నా ప్రయత్నం నేను చేస్తూనే వున్నాను" అన్నాడు స్వామి.

"స్వామి! మా జన్మలు చరితార్థమయ్యాయి. ఎల్లవేళల మా ధ్యాస నీ పాద సన్నిధిపై వుండే విధంగా అనుగ్రహించు" అని మిత్రులు ఇద్దరూ స్వామి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసారు.

స్వామి "తథాస్తు" అని అంతర్ధానమయ్యాడు.

* * * * *

"స్వామి.... నీవెంతటి కరుణామయుడవయ్యా, ఈ దుష్టుల మీద నీకెంతటి అనుగ్రహమయ్యా! స్వామీ! ఎప్పటికీ నీ దివ్యమంగళ విగ్రహం మా కళ్ళముందు ఇలాగే దర్శనమిచ్చేటట్లు అనుగ్రహించవయ్యా......స్వామీ....స్వామి...."అని నిద్రలో కలవరిస్తున్న భర్తని చూసిన సత్య "ఏమండీ.......ఏమండీ.....ఏమిటి కలవరిస్తున్నారు? ఏం జరిగింది?" అని తట్టి లేపింది.

భార్యపిలుపుకు కళ్ళు నలుపుకుంటూ లేచిన కృష్ణ " ఏమిటి? ఎక్కడ వున్నాను... నీ ఆరోగ్యం ఎలా వుంది?" అని అయోమయంగా ప్రశ్నించాడు.

"నా ఆరోగ్యానికి ఏమైంది...... అసలు మీకేమయింది" అని ఆందోళనగా అడిగింది.

" మన కొడుకు, కోడలు, మనవలు ఏరి? ఇంకా రాలేదా?" అంటూ చుట్టూ కలియజూస్తూ అడిగాడు.

"ఏమిటీ! కొడుకు, కోడలు, మనవలా! మన పెళ్ళై పట్టుమని ఆరునెలలు కాలేదు. అప్పుడే మీరు అరవై సంవత్సరాలు ముందుకు వెళ్ళిపోయారే? " అని ఆశ్చర్యంగా అడిగింది సత్య.

"ఏమిటీ! మనకి ఈ మధ్యే పెళ్ళయిందా? ఇంతకీ గోవింద్ ఏడి?" అన్నాడు.

" గోవింద్ ఇక్కడెందుకుంటాడు? వాళ్ళింట్లో వుంటాడు " అని కొద్ది చికాకుతో కూడిన ఆందోళనతో అంది సత్య.

"లేదే! ఇప్పటివరకు నాతోనే వున్నాడే? వాడూ, నేనూ స్వామితో చాలా సేపు సంభాషించాము. ఇంతకి నా స్వామి.......... నా స్వామి ఏడి" అని పిచ్చివాడిలా అన్నిచోట్ల వెతుకుతున్నాడు.

"స్వామా! ఏ స్వామి? మీరు భక్తులు కూడా అయిపోయారా? ఈ మధ్యేగా మీ స్నేహితుడితో భగవంతుడి గురించి అడ్డదిడ్డంగా వాదించారు." అంది సత్య.

"అలాగా!..........నాకంతా అయోమయంగా వుంది. నేను అర్జంటుగా గోవింద్ ని కలవాలి. అవును గోవింద్ ని వెంటనే కలవాలి. గోవింద్........గోవింద్.......గోవింద్" అంటూ గోవింద్ ని కలవటానికి బయలుదేరుతుండగా, గోవిందే వీళ్ళింటికి ఆందోళనగా వచ్చాడు. అలా వచ్చిన గోవింద్ ని చూసిన కృష్ణ ఆశ్చర్యంగా "గోవింద్.... ఏమిటి నువ్వు పాతికేళ్ళ క్రితం ఎలా వున్నావో, అలాగే ఇప్పుడూ వున్నావు? నీ కొడుకు, కోడలు ఎలా వున్నారు?" అని ప్రశ్నించాడు.

కృష్ణని చూసిన గోవింద్ కూడా ఆశ్చర్యపడుతూ " కృష్ణా... నువ్వు కూడా యింకా యువకుడిలా ఎలా వున్నావు? సత్య ఆరోగ్యంగా వుందా? నీ కొడుకు వచ్చాడా?" అని ప్రశ్నిస్తూ గట్టిగా కౌగిలించుకున్నాడు.

మిత్రుల విచిత్ర ప్రవర్తనకి సత్యకి పిచ్చెక్కినట్లైయింది. ఏం చెయ్యాలో అర్థం కాక ఒక బక్కెట్ నీళ్ళు తీసుకువచ్చి ఇద్దరి నెత్తిమీద గుమ్మరించింది. దాంతో ఇద్దరూ స్వప్నలోకంమండి బయటపడ్డారు. ఒక్కసారిగా ఇద్దరూ తలలు విదుల్చుకున్నారు. "కృష్ణా రాత్రి ఏం జరిగిందో తెలుసా?" అని గోవింద్ చెప్పబోతుండగా, కృష్ణ కల్పించుకుని " ఆగాగు ముందు నేను చెప్తాను" అంటే కాదు నేనని గోవింద్, ఇలా ఇద్దరూ నేనంటే నేనని

వాదించుకుంటూ, చివరకి ఇద్దరికీ ఏకకాలంలో కల్గిన ఒకేరకమైన అద్భుతమైన స్వప్నానుభూతిని ఒకరికి ఒకరు చెప్పుకుంటూ, ఆశ్చర్యచకితులవుతుండగా శ్రీరామ్ వచ్చాడు. శ్రీరామ్ ని చూడగానే ఇద్దరికి ప్రాణం లేచి వచ్చినట్లయింది. అమాంతం శ్రీరామ్ ని ఇద్దరూ ఎత్తేసుకుని వారికి కల్గిన స్వప్న వృత్తాంతాన్ని వివరించి ఆనందపారవశ్యంతో ఉబ్బితబ్బిబ్బు అయిపోతూ ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

"శ్రీరామ్ యిలాంటి స్వప్నం రావటమేమిటి? స్వప్నం యింత సుదీర్ఘంగా వుండటం ఏమిటి? అదీ మా ఇద్దరికీ ఏక సమయంలో, ఒకేవిధమైన స్వప్నం ఎలా వచ్చింది? దీనిలో వున్న అంతరార్థమేమిటి? మాకంతా అయోమయంగా వుంది. ఇది కలే అని కొట్టిపారేద్దామనుకుంటున్నా, ఆ అనుభూతి మాకు మరపురావటం లేదు." అని మిత్రులిద్దరూ ఆశ్చర్యంతో కూడిన ప్రశ్నల వర్షం కురిపించారు.

అంతా సావధానంగా విన్న శ్రీరామ్ " ఆ జగన్నాటక సూత్రధారి యొక్క లీలలకు కారణాలు ఎవ్వరం చెప్పలేము. ఆ సర్వజ్ఞుడు సంకల్పిస్తే ఏదీ అసాధ్యం కాదు. మిమ్మల్ని భగవంతుడు తన అపార కరుణతో అనుగ్రహించాడు. భగవదనుభవాన్ని ఎవరికివారు అనుభవం ద్వారా తెలుసుకోవల్సిందే. ముందు మీరు ఇదంతా స్వప్నమని, అసత్యమనే తర్కవితర్కాలకి దిగకండి. మీరు స్వప్న ప్రపంచంలో వున్నంతవరకూ యథార్థంగా ఏ విధంగా అనుభవిస్తామో, ఆ విధంగా పరిపూర్ణంగా అనుభవించారు. మిమ్మల్ని మాత్రమే అనుభవింపజేయటానికే భగవంతుడు మీకొరకు సృష్టించిందే ఆ స్వప్నప్రపంచం. మీ ప్రారబ్ధకర్మాను సారంగా మీరనుభవించవలసిన కష్టాల్ని, బాధల్ని మీమీద అనుగ్రహంతో స్వప్నంలో కలగజేసి మీమీ ప్రారబ్ధాల్ని తొలగింపజేసాడు. మీకు లభించిన ఈ ఉత్తమ జన్మ వృథా కాకుండా మీకు స్వప్నంలో భవిష్యత్ ని దర్శింపజేసి, తద్వారా మీకు సక్రమ మార్గాన్ని గోచరింపజేసి, తన తత్త్వాన్ని తెలియజేసి మిమ్మల్ని తరింపజేసాడు. భగవంతుడు మీకు తెలిపిన తత్త్వాన్ని ఆకళింపు చేసుకుని ఆ దిశగా పయనించి మీ జీవితాల్ని సార్థకం చేసుకోండి" అని హితవు చెప్పాడు.

"నీలాంటి స్నేహితుడు లభ్యమవటం నిజంగా మా అదృష్టం. నీవల్లే మాకు భగవదనుగ్రహం లభించింది. నువ్వే మాకు ఆదర్శం, నువ్వే మాకు మార్గదర్శకుడివి. భగవంతుడు ఉపదేశించిన మార్గంలో మమ్మల్ని పయనింపజేసి మా జన్మల్ని చరితార్థం చేసే బాధ్యత నీదే" అన్నాడు కృష్ణ.

"నేను నిమిత్తమాత్రుడ్ని. మనందరిని తరింపజేసే చరమోపాయం ఆచార్యుడే(గురువు). మిమ్మల్ని మా ఆచార్యులవారికి పరిచయం చేస్తాను. ఆయనే మన జీవన గమనానికి మార్గాన్ని నిర్దేశిస్తారు." అన్నాడు శ్రీరామ్.

"అలాగే శ్రీరామ్. మాకు కల్గిన ఈ అనుభూతిని నీటిమూటగా మిగల్చకుండా పదిమందితో పంచుకోవాలనివుంది" అన్నాడు కృష్ణ.

"మంచి ఆలోచన, అందుకు ఏం చేయాలనుకుంటున్నారు" అని ప్రశ్నించాడు శ్రీరామ్.

" స్వప్నంలో మాకు కల్గిన భగవదనుభూతిని, భగవంతుడు ఉపదేశించిన జ్ఞానాన్ని అక్షరరూపంలో పెట్టాలనివుంది. మేము పొందిన ఆ అనుభవాన్నంతా "భగవంతునికీ..........బాధా!" అనే శీర్షికగా ప్రజల ముందు వుంచాలని వుంది" అన్నారు కృష్ణ, గోవింద్ లు.

"సత్ సంకల్పం. మీ మనోవాంఛ చిత్త శుద్ధితో కూడుకున్నది. మీ ప్రయత్నానికి తప్పక భగవత్, భాగవత, ఆచార్య అనుగ్రహం లభిస్తుంది. రండి మనము యిప్పుడే గురువుగార్ని కలసి అంతా వివరిద్దాము. ఆయన అనుగ్రహాన్ని పొందుదాము" అని శ్రీరామ్ మిత్రులను తన

ఆచార్యుల వద్దకు తీసుకు వెళ్ళి, వార్ని ఆధ్యాత్మికదిశగా పయనింపజేయటానికి ఉద్యుక్తుడయ్యాడు. మిత్రులు నూతన జన్మని పొందినట్లుగా భావిస్తూ శ్రీరామ్ ని అనుసరిస్తున్నారు.

* * *

పాలకడలి నుండి ఈ విష్ణుమాయనంతా వీక్షించిన అమ్మవారు ఎంతో సంతృప్తితో, ఆనందంతో స్వామి వారిని స్తోత్రం చేయగా, అందుకు స్వామివారు పరవశించి చిరుమందహాసంతో "దేవీ! నీ అభీష్టం నెరవేరిందా? నీ అభిమతం మేరకు నాలోని షడ్గుణాలని ప్రేరేపించి ఆ జీవులను తరింపజేసావు కదా!" అంటూ దగ్గరకు తీసుకున్నారు.

"నాదేముంది స్వామి, నేను మీకు పరతంత్రురాలిని, మీ వాత్సల్య, సౌశీల్యాది గుణాలే ఎంతటి వారినయినా అనుగ్రహింపజేస్తాయి. నాదొక చిన్న విన్నపము స్వామీ, దయతో ఆలకించండి" అని అమ్మవారు తన మనోభిప్రాయాన్ని వెల్లడించటానికి స్వామి వారి అనుమతి కోరారు.

" విన్నపించు దేవీ" అంటూ స్వామి అనుమతి ఒసంగారు.

"ఆ మిత్రుల ద్వారా మరికొందరు జీవులు మీకు సమ్మతమైన మార్గంలో పయనించి తద్వారా మీ అనుగ్రహానికి పాత్రులయ్యే విధంగా వారిని తీర్చిదిద్దండి స్వామి" అన్నారు అమ్మవారు.

"తథాస్తు" అని స్వామి అభయమిచ్చారు.

* * *

శుభమ్
సర్వేజనా సుఖినోభవంతు.
జై శ్రీమన్నారాయణ

రచయిత
సాతులూరి నరసింహాచార్యులు, ఎం.ఏ., బి.ఇడ్.,
సెల్ నంబరుః 98485 31649
**e-mail: simha_30@yahoo.com**

నివాస చిరునామాః
LIG 189, భరత్ నగర్ కాలనీ,
శ్రీ సుందర హరి నిలయము,
సనత్ నగర్ పోస్టు
హైదరాబాద్ - 500 018

కార్యాలయ చిరునామాః
అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్,
రెవెన్యూ డిపార్ట్ మెంట్,
ఆం.ప్ర. సచివాలయము,
హైదరాబాద్-500 022